క్లుప్తంగా

గుంతలు పూడ్చిన అధికారులు



ఎన్టీఆర్‌మార్గ్‌లో గుంతల్లో మొరం పోసి చదును చేస్తున్న పొక్లెయిన్

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్‌టౌన్‌: జిల్లాకేంద్రం లోనీ పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు దెబ్బతినగా దీనిపై ఈనెల 9న సాక్షిలో 'అడుగుకో గుంత' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ప్రియదర్శినినగర్ ఎన్టీఆర్ మార్గ్‌రోడ్డు నెంబర్ వన్‌–ఏలోని లైన్‌–2 లో గుంతలు పూడ్చేందుకు మొరం పోయించి పొక్లెయినర్‌తో చదును చేయించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

తానూరు: మండలంలోని బోంద్రట్, భోసి గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పర్యటించనున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోంద్రట్‌లో చెరువు మరమ్మతులు ప్రారంభించి భోసి జిల్లా పరిషత్ పాఠశాలలో బాల వికాసం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల నాయకులు హాజరు కావాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో పలువురు చేరిక



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన పలువురు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ గ్రామంలో పర్యటించి పలు కారణాలతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్న గ్రామానికి చెందిన కొడారి రవీందర్, సుధాకర్, గంగుబాయి, లచ్చిబాయి, తిరుపతితోపాటు పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కొడారి గోపాల్, వాల్‌సింగ్, దేవేందర్, పరమేశ్, సంతోశ్, చిన్నభూమన్న తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



ముగ్గు పోస్తున్న ఎంపీడీవో వెంకటరమేశ్

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పకడ్బందీగా నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. గురువారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలో పలువురు లబ్ధిదారులు నిర్మించుకునే ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు స్థలం ఉంటే వెంటనే ముగ్గు పోస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సోలమాన్‌రాజ్, కార్యదర్శి నారాయణ్ ఉన్నారు.

గోదావరి ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దస్తురాబాద్: గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విశ్వంభర్ ఓ ప్రకటనలో కోరారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతుందన్నారు. కడెం ప్రాజెక్టు గేట్లు తెరిచే అవకాశం ఉన్నందున.. మత్స్యకారులు, పశువుల కాపరులు గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

వాహనాలు తనిఖీ

కుంటాల: వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై అశోక్ పేర్కొన్నారు. గురువారం కల్లూరు–కుంటాల రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం

ఖానాపూర్: పట్టణ ప్రజలు ప్లాస్టిక్‌ను విక్రయించడం, వినియోగించడం పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. 120 మైక్రాన్ కన్న తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎవరైనా విక్రయించినా, వినియోగించినా రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ వినని వారికి రూ.2 లక్షల జరిమానా లేదా దుకాణాల లైసెన్స్ రద్దు చేయడం వంటి చర్యలు తీసుకుంటామన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే పర్యావరణ రక్షణ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాఠశాలల్లో వనమహోత్సవం

- అమ్మ పేరిట మొక్కనూ కాపాడుదాం
- ఈనెల 15 వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం
- మొక్కలు నాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

మామడ: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటుతున్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీకో వననర్సరీ ఏర్పాటు చేసి మొక్కలను పెంచి నాటేందుకు సిద్ధంగా ఉంచారు. పాఠశాలల్లో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

అమ్మతో కలిసి మొక్క నాటి..

పర్యావరణ పరిరక్షణకు మిషన్‌లైఫ్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా విద్యాసంస్థల్లో ఎకోక్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌లు విద్యార్థుల్లో పర్యావరణ రక్షణ స్పృహను పెంచుతాయి. ఎకోక్లబ్ మిషన్ లైఫ్ కార్యక్రమం కింద భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలల్లో మొక్కలు నాటి రక్షించాల్సి ఉంటుంది. ఏక్ పేడ్ మాకే నామ్(అమ్మ పేరిట మొక్క నాటడం) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అమ్మతో కలిసి అమ్మ పేరిట పాఠశాల ఆవరణలో కాని పరిసరాల్లో కాని మొక్క నాటాలనే పిలుపునకు స్పందన లభిస్తుంది. తల్లితో కలిసి మొక్కలు నాటిన చిత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే విద్యార్థులకు ప్రశంసతోపాటు సర్టిఫికెట్లను అందిస్తారు. అడవులను పెంచేందుకు అమ్మతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలనే సందేశం విద్యార్థులకు అర్థమయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.



సిద్దులకుంట పాఠశాలలో అమ్మతో కలిసి మొక్క నాటుతున్న విద్యార్థి

ఎకోక్లబ్‌ల ఆధ్వర్యంలో....

పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో విద్యార్థులతో ఏకోక్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఏకోక్లబ్‌ల ఏర్పాటుతో మొక్కల సంరక్షణపై చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎకోక్లబ్ చైర్మన్‌గా, ఒక ఉపాధ్యాయుడు సభ్యుడిగా ఉంటారు. ప్రతి తరగతి నుంచి ఐదుగురు విద్యార్థులు ఈ క్లబ్బులో సభ్యులుగా ఉంటారు.

ఈనెల 15 వరకు నమోదు చేయాలి..

ఏకో క్లబ్ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ తల్లులతో కలిసి మొక్కలు నాటి, సంరక్షణ చర్యల ఫొటోలను ఈనెల 15 వరకు ecoclubs. education.gov.in వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయవచ్చు. అప్లోడ్ చేసిన విద్యార్థులకు ప్రశంసతో కూడిన సర్టిఫికెట్లను అందిస్తారు.



మొక్క నాటి ప్రశంస పత్రం అందుకున్న విద్యార్థి

అవగాహన కోసమే..



పర్యావరణ రక్షణపై విద్యార్థులకు అవగాహన కోసమే పాఠశాలల్లో వన మహోత్సవం నిర్వహిస్తున్నాం. ఏకో క్లబ్ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మొక్కలు నాటే ఫొటోలు అప్‌లోడ్ చేసేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలి. మొక్క నాటిన విద్యార్థికి ప్రశంసపత్రం అందిస్తారు. – రామారావు, డీఈవో

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కమిటీ కన్వీనర్ దశరథ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువును పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరం నిర్మల్ జిల్లా కమిటీ సభ్యులు భూమేష్,నరేష్, జ్ఞానేశ్వర్, సుంకరి సుదర్శన్ పాల్గొన్నారు.

సారంగపూర్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కమిటీ సభ్యులు కల్లూరు సుధాకర్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు లేక సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన పాఠశాలలు, కళాశాలలకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కందూరు వినోద్, దేవి శంకర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పిల్లి నాగయ్య, సతీశ్ ఉన్నారు.



లక్ష్మణచాందలో తహసీల్దార్ సరితకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

యథేచ్ఛగా దేశీదారు విక్రయాలు

- మండలంలో జోరుగా దందా
- చేన్లలో నిల్వచేసి అమ్ముతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

కుభీర్: మండలకేంద్రంతోపాటు మండలంలోని రంజని తదితర గ్రామాల్లో మహారాష్ట్ర నిషేధిత మద్యం దేశీదారు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కట్టడి చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో మండలంలోని విక్రయదారులు మహారాష్ట్రలోని పాలజ్, దివిసి, పౌన, హిమాయిత్ నగర్ గ్రామాలకు వెళ్లి దేశీదారు తెచ్చుకొని ఇక్కడి గ్రామాల్లో అమ్మేవారు. కానీ ప్రస్తుతం మహారాష్ట్ర మద్యం వ్యాపారులు ఇక్కడ ఏజెంట్లను నియమించుకొని వారి ద్వారానే రాత్రి వేళ దేశీదారు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

అధికారులకు తెలిసినా..

మండలంలోని గ్రామాల్లో ఎక్కడెక్కడ దేశీదారు విక్రయిస్తున్నారో సంబంధిత శాఖల అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అప్పుడప్పుడు మాత్రం చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారని పేర్కొంటున్నారు. కొందరు చేన్లలో దేశీదారు నిల్వలు ఉంచుకొని విడతల వారీగా అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దేశీదారు కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

భైంసాటౌన్‌: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని 19 మందికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ రూ.6.50లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం లోకేశ్వరం మండలంలోని ధర్మోరాలో అభయాంజనేయ ఆలయ అభివృద్ధికి రూ.40లక్షలు, తానూరు మండలంలోని బెల్‌తరోడాలో కృష్ణ మందిరం కోసం రూ.30లక్షలు మంజూరవగా ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధులు మంజూరు చేసినందుకు సీఎం, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, ఆత్మ చైర్మన్ వివేకానంద తదితరులున్నారు.



చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్

ఎంఐఎం పార్టీ పట్టణ కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాలులో గురువారం ఎంఐఎం నాయకులు సమావేశం నిర్వహించగా ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సమాద్ బిన్ అబుదాన్ హాజరై మాట్లాడారు. పార్టీ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈసందర్భంగా పార్టీ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా షేక్ అఖిల్, ప్రధాన కార్యదర్శిగా అప్సర్ ఖాన్, 6వ వార్డు అధ్యక్షుడిగా అబ్దుల్ రిజ్వాన్ ఖాన్, 8వ వార్డు అధ్యక్షుడిగా షేక్ నయూం, 12వ వార్డు అధ్యక్షుడిగా షేక్ కైఫ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ అజీమ్ బిన్ యాహియా తదితరులున్నారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నేతలు

22న మానవ హక్కుల సదస్సు

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో నేషనల్ రైట్స్ మూమెంట్ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా చైర్మన్ సోఫీ మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. సదస్సుకు జాతీయ అధ్యక్షుడు రాజేశ్‌ఆచార్య, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మహమ్మద్ సాహిల్‌ఖాన్ వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. జిల్లా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మహమ్మద్ ఇలియాస్, జిల్లా ఉపాధ్యక్షులు షరీఫ్ బిన్ హాది, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసాక్ అలీ, సెక్రెటరీ ఇర్ఫాన్ ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ ఇమ్రాన్

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాలులో ఈనెల 12న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు ఆడెపు కోరారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

దస్తురాబాద్: ఖానాపూర్‌లో నిర్వహించే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్ కోరారు. గురువారం దస్తురాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజునాయక్, రాజనర్సయ్య, గోపి, సుధాకర్, శంకర్, విలాస్, గంగన్న, కల్యాణ్, నర్సయ్య, రవీందర్ చారి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కడెం: బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే జాబ్‌మేళాలో 60 కంపెనీలు పాల్గొంటాయని..యువత పార్టీలకతీతంగా తరలిరావాలని కోరారు.



దస్తురాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కుంటాల: గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షన్ ఎస్‌బీఎం కార్యక్రమం కింద జిల్లాలో ఎంపిక చేసిన 20 గ్రామాలను ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎస్‌బీఎం ప్రతినిధి ప్రియాంక పేర్కొన్నారు. మండలంలో ఎంపికైన కల్లూరు, దౌనెల్లి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. గురువారం దౌనెల్లి గ్రామంలో మురికి కాలువలు, మరుగుదొడ్లు, డంపింగ్ యార్డు, ఇంకుడుగుంతలు పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏపీవో గట్టుపల్లి నవీన్, కార్యదర్శి సాయేందర్ తదితరులు పాల్గొన్నారు.



దౌనెల్లిలో పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



కుంటాల: కల్లూర్‌లో బాబాకు హారతినిస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయం, కుంటాలలోని శ్రీరామకృష్ణ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాబా ఆలయంలో అఖండసాయి నామ సంకీర్తన, సప్తాహ పారాయణం సమాప్తి, దివ్య ప్రవచనాలు తదితర పూజాది కార్యక్రమాలు జరిపించారు. గురువుల ఆశీర్వచనం తీసుకున్నారు.

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబాతోపాటు పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యానగర్‌లోని తమ సంఘ భవనంలో గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులను బీజేపీ ఆధ్వర్యంలో సన్మానించారు. అంతకముందు వ్యాసమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. పండితులు సుదర్శన్, రామకృష్ణశర్మ, సరస్వతి ఆనంద్, నర్సింహమూర్తి, సందీప్‌శర్మ, అభిషేక్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, వెంకటేశ్‌శర్మ, రేవంత్‌శర్మ, బీజేపీ నాయకులు శ్రీనివాస్, మహేందర్, రాజేందర్ ఉన్నారు.

భైంసాటౌన్‌: పట్టణంలోని పాఠశాలల్లో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యాసమహర్షి చిత్రపటానికి పూజలు చేసి గురువులను సన్మానించారు. స్థానిక బాగుబాయి గుట్టపై ఉన్న సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు చేశారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్ ఆలయంలో పూజలు చేశారు. గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్, కిసాన్‌గల్లి, పులేనగర్, ఏపీనగర్ పాఠశాలల్లో గురుపూజోత్సవం నిర్వహించారు.



మంగళహారతితో ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: మండలకేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా సరస్వతీ విద్యాపీఠం జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్‌కిషన్ వ్యాసమహర్షి, సరస్వతీ మాత, ఓంకారం, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి వెలిగించారు. పాఠశాల కార్యదర్శి వేదపఠక్ నిశికాంత్, సభ్యులు కందిదత్తాత్రి, ప్రధానాచార్యులు సారథిరాజు, అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్నశర్మ, ఆచార్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు..

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామశివారు బ్రహ్మేశ్వరాలయంలోని శివాలయంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యానంద స్వామిజీ సమాధి వద్ద మంగళహారతిలో పాల్గొన్నారు. బీజేపీ మండల కన్వీనర్ సాయన్న, పురుషోత్తం, శ్రీనివాస్‌రావు ఉన్నారు.



ముధోల్‌లో గురువును సన్మానిస్తున్న ఆచార్యులు



ఖానాపూర్‌లోని విద్యానగర్‌లో పండితులను సన్మానిస్తున్న బీజేపీ నేతలు



సారంగపూర్ : మలక్‌చించోలిలో..

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు శివనంద గిరిస్వామిని సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్, శేఖర్, గంగాధర్, నర్సయ్య, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి

సారంగపూర్: సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశవర్కర్లు మండలకేంద్రంలోని బస్టాండ్ నుంచి ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ నాయకురాలు స్వరూప మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అందించి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు సుజాత, అంగన్‌వాడీ టీచర్లు వనజ, రాధ, వత్సల, శ్యామల, సుశీల, రాజమణి, జ్యోతి, ఆశాకార్యకర్తలు స్వరూప, లక్ష్మి తదితరులు ఉన్నారు.

తప్పుల్లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి

నిర్మల్: బోగస్, చనిపోయినవారి ఓట్లు తొలగించి తుది ఓటరు జాబితా రూపొందించాలని శిక్షణ అధికారి విజయ్‌కుమార్.. బీఎల్‌వోలకు సూచించారు. గురువారం నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని రైతువేదికలో నర్సాపూర్(జి) మండలంలోని బీఎల్‌ఓలకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. మరణించిన వారి ఓట్లు తొలగింపునకు మరణ ధ్రువీకరణపత్రం జతపరచాలని సూచించారు. సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించి పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించాలని తహసీల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జాదవ్ శ్రీరామ్, బీఎల్వోలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కడెం: మండలంలోని నవాబ్‌పేట్ గ్రామంలోని సత్యం ట్రెడిషనల్ ట్రస్టుకు ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కడంతో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ ట్రస్ట్ చైర్మన్ రాపెల్లి సత్యంను శాలువాతో సత్కరించారు. మారుమూల ప్రాంతంలో ట్రస్ట్ ద్వారా వైద్యసేవలు అందిస్తున్న సత్యంకు అవార్డు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు వినతి

కుంటాల: మండలకేంద్రంలో ప్రధాన వీధుల్లో స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల గజేందర్ గురువారం తహసీల్దార్ కమల్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. స్పీడు బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొనగా.. తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు.

వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి

ఖానాపూర్: ప్రైవేటు వాహనాలతోపాటు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఉమ్మడి ఆదిలాబాద్ టీజీవీపీ అధ్యక్షుడు కె.ప్రవీణ్‌కుమార్ కోరారు. ఖానాపూర్ పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు స్టీరింగ్ పనిచేయక చెట్టును ఢీకొనడంతో విద్యార్థులు గాయపడ్డారు. నామ మాత్రపు తనిఖీలతోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు.

పరామర్శ

సారంగపూర్: మండలంలోని సాయినగర్ తండాకు చెందిన వెంకట్‌రాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గురువారం మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మృతికి కారణాలను ఆయన కుమారులు శ్రీధర్, సుధాకర్ ను అడిగి తెలుసుకున్నారు. పలువురు నాయకులు ఉన్నారు.

పాఠశాలలో గోరింటాకు సంబరాలు



గోరింటాకు పెట్టుకుంటున్న విద్యార్థినులు

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం గోరింటాకు సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు ఇంటి నుంచి పాఠశాలకు గోరింటాకు తెచ్చుకొని చేతులకు పెట్టుకున్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శంకర్ మాట్లాడుతూ ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమన్నయాదవ్, మాధవ్‌రావ్, సుదర్శన్, రజినీకాంత్, సుజాతదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గురువారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. దేవాదాయ శాఖ నిధులు రూ.12లక్షలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్